సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



నాణ్యత తప్పనిసరి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు.

8లో▸



కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అర్హులందరికీ న్యాయం చేకూరుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.

8లో▸



కాశన్నకుంటకు అధికారులు

మత్స్యకారుల ఫిర్యాదు మేరకు సోమవారం ఇరిగేషన్, పీసీబీ అధికారులు కాశన్నకుంటను పరిశీలించారు.

8లో▸

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు

తుక్కుగూడ: జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఏఎన్ఎంలు, అకౌంటెంట్ల (మహిళలు) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 44 సంవత్సరాల వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, విభిన్న ప్రతిభావంతులకు పదేళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించే దరఖాస్తు ఫారానికి అర్హత సర్టిఫికెట్లు జత చేసి, నవంబర్ 1 సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ హీర్యానాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఇబ్రహీంపట్నం: మండల విద్యాధికారిగా హీర్యానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ వెంకట్‌రెడ్డి సోమవారం ఆయనకు చార్జ్ అప్పగించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు నూతన విద్యాధికారిని ఘనంగా సన్మానించారు.

కొనసాగుతున్న దక్షిణకొరియా పర్యటన



మంత్రులు, కాంగ్రెస్ నేతలతో ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సియోల్‌లోని ప్రాంతాలను సందర్శించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆమోదిత ప్రాజెక్టులపై దుష్ప్రచారం తగదు

నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు మేకా విజయ సాయి

లక్డీకాపూల్: ఆమోదం పొందిన ప్రాజెక్టులను అక్రమంగా నిర్మించారనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇది సరికాదని నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు మేకా విజయసాయి అన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నారెడ్కో సభ్యులెవరూ ప్రాజెక్టులు చేపట్టరని స్పష్టం చేశారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెల్లుబాటయ్యే అనుమతులు ఉన్న అన్ని ప్రాజెక్టులను ప్రభుత్వం పరిరక్షిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని గుర్తు చేశారు. స్థలాలు, ఇళ్ల కొనుగోలుకు ఎలంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ భూములను పరిరక్షించాలనే హైడ్రా లక్ష్యాలను నారెడ్కో తెలంగాణ స్వాగతిస్తుందన్నారు. రాబోయే సంవత్సరాల్లో తెలంగాణలో రియల్ ఎస్టేట్ వృద్ధికి మూసీ ప్రక్షాళన తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. నారెడ్కో ప్రాపర్టీ షో ఈ నెల 25న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విభిన్న ప్రాపర్టీలను ప్రదర్శిస్తున్నట్లు విజయ సాయి తెలిపారు. సమావేశంలో నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వై.కిరణ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి, కోశాధికారి ఆర్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

24న తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: కృష్ణా వాటర్ ఫేజ్–3 పంపింగ్ మెయిన్ లీకేజీ మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి వర్గాల తెలిపాయి. శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట్, ఆళ్లబండ, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహెబ్ నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్లు, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్ర నగర్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జున నగర్, మాణిక్ చంద్, చెంగిచెర్ల, భరత్‌నగర్, పీర్జాదిగూడ, పెద్ద అంబర్‌పేట్, ధర్మసాయి(శంషాబాద్) ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-1 మెయిన్స్ ప్రారంభం

11 కేంద్రాల్లో తొలిరోజు 5,854 మంది హాజరు

- సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్
- కట్టుదిట్టమైన భద్రతకు ఆదేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో గ్రూప్‌– 1 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 11 కేంద్రాల్లో 8,011 మందికి గాను మొదటి రోజైన సోమవారం 5,854 మంది ఎగ్జామ్ రాశారు. హాల్ టికెట్లతో వచ్చిన అభ్యర్థులను క్షుణ్నంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపించారు. నిర్దేశిత సమయం(మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల) తర్వాత వచ్చిన అభ్యర్థులను నిరాకరించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు నిరాశతో వెనుదిరిగారు. ఈ నెల 27 వరకు ఎగ్జామ్స్ కొనసాగనున్న నేపథ్యంలో పోలీసు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా రాయండి

మొయినాబాద్ రూరల్: గ్రూప్‌– 1 పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల, అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎగ్జామ్ సెంటర్లలో పర్యటిస్తూ అభ్యర్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. సెంటర్ల వద్ద పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచించారు. విద్యాజ్యోతి కళాశాలలో 984 మంది అభ్యర్థులకు గాను 627 మంది, జేబీఆర్ఈసీ కాలేజీలో 816 మందికి 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, స్థానిక తహసీల్దార్ గౌతమ్‌కుమర్, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నర్సింహులు, గిర్దావర్ సుజిత్‌రెడ్డి, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందులు ఎదురు కానీయొద్దు

మొయినాబాద్: చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రూప్‌–1 పరీక్ష సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాలేజీలోని 31వ పరీక్ష కేంద్రంలో 600 మందికి 394 మంది, 32వ సెంటర్‌లో 600 మందికి 374 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

ఇబ్రహీంపట్నం: గ్రూప్‌–1 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సెంటర్ల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్, శ్రీఇందు, శ్రీదత్త, గురునానక్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో 4,027 మందికి గాను 3,165 మంది హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు శ్రీఇందు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.



మొయినాబాద్‌లోని కేజీరెడ్డి కాలేజీలో సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ట్రాఫిక్‌లో చిక్కుకుని ఆలస్యంగా సెంటర్‌కు వచ్చిన అభ్యర్థి నిర్వేదం



మొయినాబాద్‌లోని విద్యాజ్యోతి కాలేజీలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కాలేజీ వద్ద సందడి

విద్యుత్ అంబులెన్స్‌లు ప్రారంభం

- సెంట్రల్ బ్రేక్‌డౌన్ బృందాలకు అప్పగింత
- నిరంతరాయ విద్యుత్ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అంతరాయాలను గుర్తించి, సరఫరాను సత్వరమే పునరుద్ధరించే సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) విభాగాన్ని మరింత పటిష్టపరచడమే కాకుండా ఆ బృందాల చేతికి విద్యుత్ అంబులెన్స్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం నెక్లెస్‌రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణంలో ఆయా అత్యవసర వాహనాలను ప్రారంభించారు. అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈదురుగాలులతో కూడిన వర్షం, ఇతర విపత్తుల సమయంలో తలెత్తే అంతరాయాలను గుర్తించి, సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 1912 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను ఈ బృందాలు పరిష్కరిస్తాయన్నారు. హైదరాబాద్‌లోని 57 సబ్ డివిజన్లు ఉండగా, ఒక్కో డివిజన్‌కు ఒక వాహనాన్ని సమకూర్చినట్లు పేర్కొన్నారు. ప్రతి వాహనంలో ఒక అసిస్టెంట్ ఇంజనీరు, ముగ్గురు లైన్స్ సిబ్బందిసహా థర్మో విజన్ కెమెరా, రంపపు మిషన్, నిచ్చెన, ఇన్సులేటర్, కండక్టర్లు, కేబుల్స్, ఎర్త్‌రాడ్, హెల్మెట్ వంటి భద్రతా పరికరాలన్నీ ఉంటాయని తెలిపారు. ఈ వాహనాలకు ట్రాన్స్‌ఫార్మర్లను పట్టి లాగే సామర్థ్యం కూడా ఉంటుందని, తద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఫెయిలైన డీటీఆర్‌ల మార్పు సులభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే సేఫ్టీ కిట్స్

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల అందజేత

మహేశ్వరం: గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఎంతగానో ఉపయోగపడుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సేఫ్టీ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చాలా ఎత్తులో ఉండే తాటి చెట్లను ఎక్కే క్రమంలో గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, రక్షణ కిట్ల ద్వారా వీటికి చెక్ పెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఒక్కో సేఫ్టీ కిట్ 1,500 కిలోల బరువును సైతం తట్టుకుంటుందన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడింది, వారిని కంటికి రెప్పలా కాపాడుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని తెలిపారు. పాలనను గాలికి వదిలేసిన ప్రస్తుత ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మాధవరెడ్డి, మహేశ్వరం ఎక్సైజ్ సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



కాటమయ్య రక్షణ కవచాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



నిర్మాణ వ్యర్థాల తొలగింపు

ఎర్రకుంట చెరువు నుంచి మొదలెట్టిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: జలవనరుల్లోని అక్రమనిర్మాణాలను కూల్చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వాటి వ్యర్థాల తొలగింపునూ ప్రారంభించింది. ఆయా చెరువుల పునరుజ్జీవనంలో భాగంగా ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. నిజాంపేట పరిధిలోని ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)లో ఉన్న వ్యర్థాల తొలగింపును సోమవారం ప్రారంభించింది. ఐదు అంతస్తులతో నిర్మించిన మూడు భవనాలను గత ఆగస్టు 14న కూల్చేయగా ఇనుముతోపాటు ఇతర సామగ్రిని తీసుకువెళ్లిన యజమానులు వ్యర్థాలను అక్కడే వదిలేశారు. దీనిపై వారికి నోటీసులు ఇచ్చిన హైడ్రా అధికారులు వాటి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరో మూడు రోజులపాటు ఈ ప్రక్రియ జరగనుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు ఎర్రకుంట చెరువు పునరుజ్జీవన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువులో అక్రమనిర్మాణాలను తొలగించడమే కాకుండా వ్యర్థాలను తరలించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా ఇతర ప్రాంతా ల్లోని నిర్మాణ వ్యర్థాలను హైడ్రా అధికారులు తొలగించనున్నారు.

జూ టాయ్‌ట్రైన్.. మళ్లీ జాయ్

చార్మినార్: కొన్ని నెలలుగా మొండికేసిన జూపార్కు టాయ్ ట్రైన్ మరమ్మతులు పూర్తి చేసుకొని ఎట్టకేలకు సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. దీనిలో జూపార్కును కేవలం 20 నిముషాల్లో చుట్టి రావచ్చు. 2.5 కిలోమీటర్ల దూరం వరకు ఈ ట్రాయ్ ట్రైన్‌లో జూపార్కు మొత్తం ప్రయాణించవచ్చు. ఈ ట్రైన్ ఇంజిన్ రిపేర్‌కు రావడంతో కొన్ని నెలలుగా అందుబాటులో లేదు. 1968లో బీహెచ్ఈఎల్ వారు దీనిని జూపార్క్‌కు గిఫ్టుగా అందజేశారు. 3 బోగీలతో 90 సీట్లు కలిగిన ఈ ట్రైన్ ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ట్రైన్‌లో ప్రయాణిస్తూ జూపార్క్‌లోని పులులు, ఏనుగులు, కోతులు, జింకలు, తాబేలు, పక్షులను దగ్గర నుంచి చూడవచ్చు.

చదువుతోనే సమాజంలో మార్పు



జూనియర్ కళాశాల భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

- విద్యను అంగట్లో సరుకులా మార్చారు
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్
- షాద్‌నగర్‌లో జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

షాద్‌నగర్: విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తేనే సమాజంలో మార్పు వస్తుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరామ్ మాట్లాడుతూ.. సమాజంలో గౌరవంగా బతకాలంటే చదువు తప్ప మరో మార్గం లేదన్నారు. సామాజిక స్పృహ, వ్యక్తిలో పరిణితి రావాలంటే విద్యతోనే సాధ్యమని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న చదువు ప్రస్తుతం అంగట్లో సరుకులా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతీ విద్యార్థి జీవితంలో చదువు ఎంతో కీలకమైనదని తెలిపారు. ఇంటర్ విద్య జంక్షన్ బాక్స్ వంటిదని, ఈదశ నుంచి భవిష్యత్ కోసం ఎటువైపు అడుగులు వేయాలో నిర్ణయించుకుంటారని తెలిపారు. విప్లవకారుడు తుర్రేబాజ్‌ఖాన్ షాద్‌నగర్ ప్రాంతంలోనే తలదాచుకొని బ్రిటీష్ పాలనకులపై పోరాటం చేశారని గుర్తుచేశారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే శంకర్ దాతల సహకారంతో కాలేజీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని కొనియాడారు.

తెలంగాణను నాశనం చేశారు..

నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు నాశనం చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాతలు, పూర్వపు విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం వ్యాపారవేత్తలు యుగేందర్‌రెడ్డి రూ.25 లక్షలు, సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి రూ.6 లక్షలు, దండు వాసు రూ.5 లక్షలు, గోరీ బ్రదర్స్ రూ.1.08 లక్షల విరాళం ప్రకటించారు. కళాశాలలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి పలబట్ల పాండురంగం ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, భీష్వ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



శుభ గడియలు

- ముగిసిన మూఢాలు
- వివాహాది శుభకార్యాలకు లైన్ క్లియర్
- ఖరారవుతున్న వివాహ తేదీలు
- ఫంక్షన్ హాళ్లు, వస్త్రాభరణాలకు భలే డిమాండ్

షాబాద్: మూడు నెలలపాటు కొనసాగిన మూఢాలు ముగిసి, శుభకార్యాలకు ముహూర్తాలు మొదలయ్యాయి. ఇకనుంచి సుమారు మూడు నెలల పాటు నిరంతరాయంగా పెళ్లి భాజాలు మోగుతాయని, శుభకార్యాలు కొనసాగుతాయని పురోహితులు, పంచాంగకర్తలు, పూజారులు, వేద పండితులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు, పెళ్లిచూపులు, సంబంధ ఒప్పందాలు, మాటాముచ్చట్లకు ఇది మంచి సమయమని పేర్కొంటున్నారు. దసరాతో మొదలైన శుభ గడియలు డిసెంబర్ 26 వరకు ఉన్నాయి. ఈ కాలంలో దాదాపు 32 రోజులకుపైగా సుముహూర్తాలు ఉండటంతో డప్పువాయిద్యాలు, మండపాలు, కేటరింగ్ నిర్వాహకులకు ఆర్డర్లు మొదలయ్యాయి. దీపావళి వేడుకలతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో మార్కెట్‌లో సందడి మొదలైంది. వస్త్ర, బంగారం దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. బంగానే ఆభరణాల కోసం ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముహూర్తాలు ఇలా...

అక్టోబర్: 12, 13, 16, 20, 23, 24, 27, 28

నవంబర్: 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17, 18, 23, 25

డిసెంబర్: 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18, 20, 25, 26


షాపింగ్ మాల్స్ సందడి...

పెళ్లంటే ప్రత్యేకంగా కనిపించాలని వధూవరులతో పాటు కుటుంబీకులు, అతిథులు ఆసక్తి చూపుతుంటారు. షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తమకు నచ్చిన దుస్తులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆయా షాపుల్లో సందడి మొదలైంది. దీనికి తోడు దీపావళి పర్వదినం నేపథ్యంలో విక్రయాలు జోరందుకున్నాయి.

ముస్తాబవుతున్న ఫంక్షన్ హాళ్లు

పెళ్లిళ్ల సీజన్ మొదలుతో ఫంక్షన్ హాళ్లు ముస్తాబవుతున్నాయి. చేవెళ్ల డివిజన్ పరిధిలో దాదాపు వందకు పైగా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వసతుల ఆధారంగా ఒక్క రోజు అద్దె రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నాయి. సీజన్ కావడంతో ధరలు కొంత పెరిగినట్లు తెలుస్తోంది. బుకింగ్స్ కూడా జోరందుకున్నాయని ఓ ఫంక్షన్ హాల్ యజమాని తెలిపారు.

మంచి రోజులొచ్చాయి..



శుభముహూర్తాలు వచ్చేశాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రోజులు బాగున్నాయి. దీంతో వివాహాది శుభకార్యాలకు అడుగులు పడుతున్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

– శ్రీను పంతులు, పురోహితుడు, షాబాద్

'బహిరంగ చెత్త'పై అవగాహన

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



ఎలిమినేషన్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని జీవీపీ ఎలిమినేషన్ పాయింట్లను పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఎఫ్ఐతో పలు వివరాలు సేకరించారు. చెత్తను ఎన్ని గంటలకు సేకరిస్తున్నారు.. చెత్త వాహనాలు సమయానికి వస్తున్నాయా.. ఏవైనా సమస్యలు తలెత్తుతున్నాయా.. అనే అంశాలను తెలుసుకున్నారు. అనంతరం యూసుఫ్‌గూడ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

మకుటం లేని మహిళామణులు!

రాష్ట్రంలో దాదాపు 30 మంది మహిళా ఐపీఎస్‌లు

- కేవలం ముగ్గురు మాత్రమే యూనిట్ ఆఫీసర్లుగా
- వీరిలో ఇద్దరు ఎస్పీలు కాగా ఒకరు కమిషనర్
- పత్తా లేని '33 శాతం' ఫోకల్ పోస్టింగ్స్ అంశం
- ఈసారి బదిలీల్లో అయినా పరిస్థితులు మారేనా?



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఏర్పడిన తర్వాత మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వచ్చిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు వివిధ కోణాల్లో చర్యలు తీసుకున్నారు. వీటిలో భాగంగా పోలీసు విభాగంలో మహిళల సంఖ్య పెంచాలని టార్గెట్ పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర పోలీసు విభాగంలోని మహిళా ఐపీఎస్‌ల పరిస్థితి మకుటం లేని మహిళామణుల మాదిరిగా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉమెన్ ఐపీఎస్‌ల సంఖ్య దాదాపు 30 వరకు ఉంది. అయితే యూనిట్ ఆఫీసర్లుగా పిలిచే కీలకమైన ఫోకల్ పోస్టుల్లో ఉన్న వారు మాత్రం కేవలం ముగ్గురే. త్వరలో ప్రభుత్వం భారీ స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలకు కసరత్తు చేస్తోంది. ఇప్పుడైనా ఈ పరిస్థితులు మార్చే ప్రయత్నం చేస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫోకల్‌లోనూ రెండు రకాలైన పోస్టులు..

పోలీసు శాఖలో సాధారణంగా రెండు రకాలైన పోస్టులు ఉంటాయి. శాంతిభద్రతల విభాగం వంటి ప్రాధాన్యం గల వాటిని ఫోకల్ అని, సీఐడీ, ట్రాఫిక్ వంటి ప్రాధాన్యం లేని వాటిని నాన్–ఫోకల్ పోస్టులని వ్యవహరిస్తుంటారు. అయితే ఈ ఫోకల్ పోస్టుల్లోనూ రెండు రకాలైనవి ఉన్నాయి. ఏదైనా జిల్లా లేదా కమిషనరేట్‌కు నేతృత్వం వహించే అవకాశం ఉన్న ఎస్పీ ఆపై స్థాయి హోదాలోని పోస్టులను యూనిట్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఎస్పీ హోదాలోనే ఉన్నప్పటికీ... కమిషనరేట్లలోని జోన్లకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా (డీసీపీ) పని చేసే వారికి సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం, అధికారం ఉండదు. ఈ నేపథ్యంలో ఇవీ ఫోకలే అయినప్పటికీ అక్కడి పని చేసే వారిని యూనిట్ ఆఫీసర్‌గా పరిగణించరు.

'33' కాదు కదా '10' కూడా లేదు...

పోలీసు విభాగంలో వివిధ స్థాయిల్లో జరిగే రిక్రూట్‌మెంట్‌లో సైతం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. అయితే వీరికి పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే పోస్టింగ్స్‌లోనూ అదే స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో భావించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు, 9 కమిషనరేట్లు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే మొత్తమ్మీద ఉన్న 39 యూనిట్లలో పదికి పైగా మహిళా ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో పని చేయాలి. అయితే వాస్తవానికి పది శాతం కూడా యూనిట్ ఆఫీసర్లుగా మహిళా ఐపీఎస్‌లు లేరు. నిర్మల్ జిల్లాకు జానకీ శర్మిల, కామారెడ్డి జిల్లాకు సీహెచ్ సింధు శర్మ ఎస్పీలుగా ఉండగా... సిద్దిపేట కమిషనరేట్‌కు బి.అనురాధ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ముగ్గురూ మినహా మరే ఇతర యూనిట్‌కు మహిళా ఐపీఎస్ నేతృత్వంలో లేదు. కేవలం సీఐడీ, ఎస్ఐబీ వంటి విభాగాలు మాత్రమే ఉన్నాయి.

ఈసారైనా ఈ సీన్ మారేనా..?

ఈ ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల్లోనూ కేవలం సింధు శర్మ మాత్రమే డైరెక్ట్ ఐపీఎస్ కావడం గమనార్హం. మిగిలిన ఇద్దరూ రాష్ట్ర పోలీసు విభాగంలో అడుగుపెట్టి, నిర్ణీత కాలం పని చేసిన తర్వాత ఐపీఎస్ హోదా పొందిన వారే. సింధు శర్మ ప్రస్తుతం నిజామాబాద్ కమిషనరేట్‌కు సైతం ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. రాజకీయపరంగా అత్యంత సున్నితమైన ఈ రెండు యూనిట్లను ఆమె సమర్థంగా నిర్వహిస్తున్నారనే పేరు పొందారు. ఈ నెలాఖరులోపు లేదా వచ్చే నెల మొదటి వారంలో పెద్ద స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వీటి నేపథ్యంలో మహిళా ఐపీఎస్ అధికారులకు సముచిత ప్రాధాన్యం లభిస్తుందని ఆయా అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం ఈ కోణంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడి అరెస్ట్

శంషాబాద్: బాలికను వేధిస్తున్న యువకుడిని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలోని నక్షత్ర కాలనీలో పనిచేస్తున్న తోటమాలి కుమారుడు గణేష్(20) కాలనీలోని ఓ బ్లాక్‌కు చెందిన బాలిక(15) కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు పలుమార్లు తల్లిదండ్రులకు పలుమార్లు ఫిర్యాదు చేసింది. గత కొద్ది రోజులుగా అజ్ఞాతంలో ఉన్న గణేష్ ఆదివారం రాత్రి కాలనీలోకి రావడంతో కాలనీవాసులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం ఆయన పట్టణంలో రూ.17.50కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి రోడ్డు కంటే ఎక్కువ ఎత్తులో భవనం నిర్మాణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విమర్శలు చేసే వారు చేస్తూనే ఉంటారని.. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఇప్పటికే రోడ్ల అభివృద్ధికి రూ.204 కోట్లు మంజూరయ్యాయని.. త్వరలో మరో వంద కోట్లు మంజూరు చేయిస్తానన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, విజయ్, మల్లయ్య, మైసయ్య, పర్వతాలు, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పట్టణంలోని రైతువేదిక భవనంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, తహసీల్దార్ లలిత, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాశన్నకుంటకు అధికారులు

శాంపిళ్లు సేకరించిన ఇరిగేషన్, పీసీబీ శాఖలు



వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొత్తూరు: ఓ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాల కారణంగా కాశన్నకుంట చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు ఇరిగేషన్, పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఇరిగేషన్ డీఈఈ ప్రతిమ, ఏఈ మనీష, పీసీబీ అధికారి విద్యుల్లత చెరువును పరిశీలించారు. పరిశ్రమ నుంచి విడుదల చేసే జలాలతో పాటుగా చెరువు నీటి శాంపిళ్లను సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత చేపల మృతికిగల కారణాలు వెల్లడిస్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే అర్హులకు న్యాయం

ప్రభుత్వ రంగ సంస్థల సమితి చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అర్హులందరికీ న్యాయం చేకూరుతుందని ప్రభుత్వ రంగ సంస్థల సమితి చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు అవ్వాలని కోరారు. రూ.2 కోట్ల వ్యయంతో బోధునంపల్లి పాతశాల ప్రహరీ, యూజీడీ, లేమామిడి, సంగెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, కొత్తపేటలో అల్వాల బీటీ రెన్యూవల్ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ పాలన సాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, పర్వతాలు, మల్లేశ్, అనిల్, లక్ష్మణ్, రమేష్, ఆనంద్‌రెడ్డి, ఇబ్రహీం, రామకృష్ణ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



షేక్ మోసిన్(ఫైల్)

పహాడీషరీఫ్: ఆటోడ్రైవర్ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ అలీం కుమారుడు షేక్ మోసిన్(25) ఆటోడ్రైవర్. ఇతనికి నాలుగు నెలల క్రితం సనా అనే యువతితో వివాహమైంది. అప్పటి నుంచి భార్యతో పాటు అత్తింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మోసిన్‌కు అతని సోదరుడు మౌలానా ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌గా వచ్చింది. అనంతరం రాత్రి 10.37 గంటలకు జల్‌పల్లి చెరువు వద్ద ఉన్నట్లు మోసిన్ వాట్సాప్ లొకేషన్, వాయిస్ రికార్డింగ్‌ను సోదరుడికి పంపించాడు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా అతడు కనిపించలేదు. మోసిన్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేకల దొంగలకు రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: గొర్రెలు, మేకలు ఎత్తుకెళ్తున్న ఇద్దరు దుండగులను పోలీసులు రిమాండ్‌కు తరలించి వారి వద్ద నుంచి ఐదు మేకలు, రూ.1.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అంజిరెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లో నాయకపు రాజు తన ఐదు మేకలను ఇంటి ఎదుట కట్టేశాడు. ఈ నెల 15న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సోమవారం తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో కొత్తగూడెం కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. నల్గొండ జిల్లా హాలియా మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన సంపంగి వెంకటేశ్, నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన సంపంగి కోటేశ్ అలియాస్ వెంకటేశ్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా మేకలను, గొర్రెలను అపహరించుకుపోతున్నట్లు తెలిపారు. తాజాగా అనాజ్‌పూర్‌లో మేకలను అపహరించుకుపోయినట్లు అంగీకరించారు. మూడు నెలలుగా అబ్దుల్లాపూర్‌మెట్, యాచారం, మంచాల, మహేశ్వరం, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, నారాయణపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో మేకలను, గొర్రెలను అపహరించిన సంఘటనల్లో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే సెమినార్

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి కోరారు. 'ప్రజాసమస్యలు–పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఈ నెల 29న నిర్వహించనున్న సెమినార్‌కు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య, కార్యదర్శి బాల మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య హాజరవుతారని చెప్పారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీకూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సెమినార్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, నర్సింహ, రమేశ్, రాజునాయక్, కృష్ణ, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంషాబాద్: ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... పట్టణం మార్కెట్ ప్రధాన రహదారిలోని తైబజార్ వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించారు. అతడు సమీపంలోని వైన్స్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. మరణించిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఆర్‌జీఐఏ పోలీసులను సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి దుర్మరణం

సికింద్రాబాద్: రైలు ఢీకొని వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ రైల్వే స్టేషన్ ఎండ్‌సైడ్ వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు బూడిద కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో పెయింటర్ మృతి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన అల్లాపాల్(28) 15 రోజుల క్రితం మౌలాలిలోని తన అన్న ఇంటికి వచ్చి అక్కడే ఉంటూపెయింటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అతను తన స్వగ్రామానికి వెళ్లేందుకు మౌలాలి నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు పట్టాల పక్కన నడుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

'ఎస్‌ఎఫ్‌ఏ చాంపియన్‌షిప్–2024'..

గచ్చిబౌలి, ఎల్‌బీ , కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలలో పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియం, శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఎస్‌ఎఫ్‌ఏ (స్పోర్ట్స్ ఫర్ ఆల్) చాంపియన్‌షిప్–2024'లో అథ్లెట్లు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. పోటీల్లో భాగంగా 7 రోజు లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో ఉత్కంఠభరితమైన ఫైనల్స్, 100 మీటర్ల స్ప్రింట్‌లు ముగిశాయి. బాస్కెట్‌బాల్, చెస్‌తో పాటు హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ జోరు పెంచగా, అండర్–11 బాలుర విభాగంలో చెస్ క్రీడాకారులు వ్యూహాత్మక ముఖాముఖీలతో తలపడ్డారు. హ్యాండ్‌బాల్, వాలీబాల్ మొదటి, రెండవ రౌండ్లు ప్రారంభమయ్యాయి. బాలుర అండర్–12 లాంగ్ జంప్‌లో విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్‌కు చెందిన హర్విష్ శ్రీచిరి స్వర్ణం సాధించింది. సన్‌సిటీ గ్లెన్‌డేల్ అకాడమీకి చెందిన ఒమర్ అలీ బాలుర అండర్–18 షాట్‌పుట్ (5 కేజీలు)లో స్వర్ణం, బాలికల అండర్–12 లాంగ్ జంప్‌లో సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన శ్రీ సాయి అనన్య ఒడియాల స్వర్ణం సాధించారు. ఇతర ఈవెంట్‌లలో భాగంగా మంగళవారం 100మీ స్ప్రింట్ ఫైనల్స్ జరగనున్నాయి. శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్స్‌తో పాటు టైక్వాండో బౌట్‌లు జరిగాయి. టైక్వాండోలో బాలుర అండర్–14 విభాగంలో ది ఇంటిగ్రల్ స్కూల్‌కు చెందిన సల్మాన్ మాలిక్, బాలికల అండర్–14 విభాగంలో న్యూటన్ హైస్కూల్ (మోతీనగర్)కు చెందిన తిరుమణి గెలుపొందారు. 22 క్రీడా విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో 920 పాఠశాలల నుంచి దాదాపు 23,000 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఛాంపియన్‌షిప్‌లు అక్టోబరు 28 వరకు కొనసాగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



ప్రభుత్వ భూముల కబ్జాపై ఫిర్యాదు

శంషాబాద్: పట్టణంలోని సర్వేనంబర్ 626బై1లో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ రవీందర్‌దత్త్ తెలిపారు. హెచ్‌ఎండీఏకే కేటాయించిన ఈ స్థలంలో సమీపంలో ఉన్న వెంచర్ నిర్వాహకులతో పాటు కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండేళ్ల కిందటే సదరు స్థలాన్ని కబ్జాలోకి తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో తేల్చారు. హెచ్‌ఎండీఏకు కేటాయించిన ఈ స్థలంలో కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతో కబ్జా పర్వం కొనసాగుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022లో రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో మొత్తం 5.17 ఎకరాల స్థలం పక్కనే ఉన్న ఓ వెంచర్ నిర్వాహకుల ఆధీనంలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్‌తో పాటు హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులకు రెవెన్యూ అధికారులు నివేదికను అందించారు. హెచ్‌ఎండీఏ స్థలాన్ని కొందరు వ్యక్తులు తమదిగా పేర్కొంటూ చేస్తున్న ఈ తంతంగంపై అధికారులు లోతైన విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. హెచ్‌ఎండీకు చెందిన ఓ మాజీ అధికారి ఈ కబ్జా తతంగాన్ని నడుపుతున్నట్లు ఆరోపిస్తున్నారు. గతంలో సింప్లెక్స్ సమీపంలోని హెచ్‌ఎండీఏ భూములను కాజేసేందుకు చేసిన చర్యల్లానే ప్రస్తుత వ్యవహారం కొనసాగుతోందన్నారు. దీనిపై సర్కారు దృష్టి సారించి సుమారు రూ. 60 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిరుపయోగ బోర్లను గుర్తించండి

పని చేయని వాటిని ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చండి.!

- వాణిజ్య సముదాయాల్లో సిల్ట్ చాంబర్స్ తప్పనిసరి
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మిషన్‌తో కలుషిత నీటి సమస్యను గుర్తిస్తున్న జల మండలి ఎండీ

సాక్షి,సిటీబ్యూరో: నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను గుర్తించి ఇంజక్షన్ బోర్ వెల్‌గా మార్చాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మహానగర పరిధిలో భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన గౌలిగూడలో పర్యటించి నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను పరిశీలించారు. ఇంజక్షన్ బోర్ వెల్‌గా మార్చడానికి ఇలాంటి నిరుపయోగంగా బోర్ వెల్‌లను గుర్తించాలన్నారు. రోడ్లపై పారే వరదనీటిని కూడా మళ్లించి నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్స్ రీఛార్జి చేసుకోవచ్చన్నారు. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బోర్లు భవిష్యత్తులో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు కోసం ఇంజక్షన్ బోర్‌వెల్‌గా పనిచేసే అవకాశాలున్నాయన్నారు. ప్రతి వర్షపు చుక్కను రక్షించుకుంటే నీటి సమస్య ఉండదన్నారు.

సీవరేజీ కనెక్షన్లు తప్పనిసరి

కొత్తగా నిర్మిస్తున్న భవనాలకు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు సీవరేజీ కనెక్షన్లు తప్పనిసరి అని ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. సుల్తాన్‌బజార్ లో డీసిల్టింగ్ పనులను పరిశీలించిన ఆయన మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్)ను ఎప్పటికప్పుడు సిల్ట్ కార్టింగ్ వాహనాల ద్వారా తరలించాలన్నారు. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, వసతి గృహాలు తదితర యజమానులకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సూచనలు పాటించని పక్షంలో.. వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. అంతకు ముందు మాదాపూర్, అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన 1200 ఎంఎం డయా ట్రాన్స్ మిషన్ లైన్ లీకేజీ గుర్తించి దానికి మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. పైప్‌లైన్ కు సంబంధించిన ఏవైనా ఇతర పనులుంటే ఏకకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. మరమ్మతుల సమయంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషీన్

గౌలిగూడలో వినియోగదారులకు కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదులు రావడంతో సమస్యను గుర్తించడానికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రం పనితీరును పరిశీలించారు. కలుషిత నీటి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 విజయరావు, సీజీఎం ప్రభు, జీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.